క్లుప్తంగా

నేడు కలెక్టర్ పర్యటన

మహాముత్తారం: మండలంలో నేడు(శుక్రవారం) కలెక్టర్ పర్యటించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించే సంపూర్ణ అభియాన్ ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొని అన్ని శాఖల్లో అమలు అవుతున్న పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు హాజరుకావాలని కోరారు.

మండల ప్రత్యేకాధికారిగా వసుమతి

చిట్యాల: మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా అడిషనల్ డీఆర్‌డీఓ వసుమతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ రాహుల్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వసుమతికి మండల పరిషత్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

మండల ప్రత్యేకాధిరిగా నర్సింగరావు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ప్రత్యేకాధికారిగా జిల్లా సివిల్ సప్లాయీస్ అధికారి జి.నర్సింగరావును కలెక్టర్ రాహుల్‌శర్మ నియమించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు అందజేశారు.

సన్మానం



కాళేశ్వరం: కాళేశ్వరం ఎంపీటీసీ రేవెల్లి మమత నాగరాజుల పదవీ కాలం కావడంతో వారి నివాసంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెంగాని అశోక్, గ్రామ శాఖ అధ్యక్షుడు మంగాయి లక్ష్మణ్‌లు శాలువాతో గురువారం ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్సరాలుగా కాళేశ్వరం గ్రామ ప్రజలకు సేవలందించినందుకు చాలా గర్వంగా ఉందని ఎంపీటీసీ మమత అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గందె సిరి మధుసూదన్, మాజీ ఉప సర్పంచ్ సుల్తాన్, మజీద్ సదర్ సయ్యద్ సమద్, మాజీ వార్డు సభ్యులు బందేల సురేష్, సయ్యద్ ఇమ్రాన్, కావేరి రామకృష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

భూపాలపల్లి అర్బన్: సేవాలాల్ సేన భూపాలపల్లి, గణపురం మండలాల కమిటీ ఎన్నికను గురువారం నిర్వహించినట్లు జిల్లా కన్వీనర్ బానోత్ రాజునాయక్ పేర్కొన్నారు.భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా కొర్ర శేఖర్‌నాయక్, గణపురం మండల అధ్యక్షుడిగా భూక్యా పాండునాయక్‌లను నియమించినట్లు తెలిపారు.మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో మండల పూర్తి కమిటీలను నియమించడం జరుగుతుందని రాజునాయక్ తెలిపారు. నాయకులు రాజేష్‌నాయక్, సంజీవ్ నాయక్, సైదినాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలు

టేకుమట్ల: రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలైన సంఘటన టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలిలా ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్రవాహనంపై టేకుమట్ల వైపు వస్తూ ఎదురుగా వస్తున్న కారు వెనక భాగాన్ని తాకి ద్విచక్ర వాహనం అదుపు తప్పి టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో నడుచుకుంటూ వస్తున్న మహిళలను ఢీ కొట్టాడు. దీంతో హనుమకొండ పట్టణానికి చెందిన జక్కుల ప్రేమలతకు చేయి విరగగా వెలిశాల, పంగిడిపల్లి గ్రామాలకు చెందిన మరో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా ప్రేమలతను చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏఎస్సై ఇంతియాజ్ కానిస్టేబుల్ సుమన్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా చూశారు.

నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడో?

- నత్తనడకన జీపీ భవనాల పనులు
- పలు చోట్లు నిలిచిన నిర్మాణాలు



చైన్‌పాకలో నత్తనడకన నిర్మాణ పనులు సాగుతున్న జీపీ భవనం

చిట్యాల: మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 14 గ్రామ పంచాయితీలకు సరైన భవనాలు లేక పోవడంతో గత ప్రభుత్వం నూతన భవనాలను మంజూరు చేసి ఒక్కోక్క భవనానికి రూ.20లక్షలు నిధులను కేటాయించింది. కానీ ఆ భవన నిర్మాణానికి సరైన సమయంలో నిధులు రాకపోవడంతో కొన్ని గ్రామ ప్రంచాయతీ భవనాలు మధ్యలే నిలిచిపోయ్యాయి. అలాగే గతంలో దూద్‌పల్లి గ్రామ పంచాయతీ భవనం కూడా మంజూరు చేయడంతో నిధులు సరిపోవడం లేదని నిర్మాణం చేపట్టలేదు. కాగా, మళ్లీ ఆ భవనానికి అదనపు నిధులను కేటాయించడంతో పనులు ప్రారంభించారు. దీంతో నిర్మించాల్సిన గ్రామ పంచాయతీ భవనాలు 15కు చేరుకున్నాయి. అందులో ఏడు జీపీ భవనాలు మాత్రమే నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించారు. అప్పటి గ్రామ సర్పంచ్‌లే అప్పులు తెచ్చి వరికోల్‌పల్లి, కైలాపూర్, కాల్వపల్లి, వెంచరామి, అందుకుతండా, కోత్తపేట, గుంటూరుపల్లి జీపీ భవనాలను త్వరితగతిన నిర్మించారు. అయిన వాటికి ఇంత వరకు నిధులు రాకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. తెచ్చిన అప్పులు ఏలా తీర్చాలని మనోవేదనకు గురవుతున్నారు. అలాగే మండలంలో చైన్‌పాక, జూకల్, దూత్‌పల్లి, లక్ష్మీపూర్‌తండా జీపీ భవన నిర్మాణాలు నత్తనడకన పనులు కొనసాగుతున్నాయి. నైన్‌పాకలో మాత్రం బేస్‌మెంట్ వరకు మాత్రమే పనులు కాగా గోపాలపూర్ జీపీ భవనానికి శంకుస్థాపనతో సరిపెట్టుకున్నారు. అలాగే మిగాతా రెండు గ్రామ పంచాయతీలు చల్లగరిగ, ఏలేటిరామయ్యపల్లి గ్రామాలకు స్థలాలనే కేటాయించలేదు. ఏలేటిరామయ్యపల్లిలో ఇప్పటి వరకు ప్రైవేట్ రూమ్‌ను కిరాయికి తీసుకుని పాలన కొనసాగిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలను అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం నూతన ప్రభుత్వం పనులు చేస్తున్నామని చెప్పుతున్న ఆరు నెలల నుంచి ఇంత వరకు వాటిపై పట్టించుకున్న పాపాన లేదు. జీపీ భవనాలు నత్తనడక నిర్మిస్తున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల అలసత్వం మూలంగా కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. స్థానిక ఎన్నికలు జరిగి నూతన పాలక వర్గం వస్తే అసంపూర్తిగా, ఇంత వరకు పనుల ప్రారంభం కాని జీపీలలో పాలకవర్గం ఎక్కడ ఉంటారో, పాలన ఏలా చేయాలో తెలియని దుస్థితి నెలకోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చేసిన పనులకు నిధులు కేటాయించి, నూతన భవనాలకు మోక్షం కల్పించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



నివాళులర్పిస్తున్న నాయకులు

రేగొండ: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని కురుమ సంఘం జిల్లా నాయకుడు కదారి జనార్ధన్ అన్నారు. మండలంలోని తిరుమలగిరి గ్రామంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు అని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రస్తుత యువత కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి దుస్తుల అందజేత



దుస్తులు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ ఆది సునీతరఘు

టేకుమట్ల: మండల కేంద్రంలో పని చేస్తున్న గ్రామ పంచాయితీ సిబ్బందికి మాజీ ఎంపీటీసీ ఆది సునీతరఘులు గురువారం దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం పదవి విరమణ అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బంది అలుపెరుగని సేవలకు గానూ దుస్తులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శైలజ, ఎంపీడీఓ అనిత, పంచాయతీ కార్యదర్శి అడగాని సాంబశివరావు, పెద్దంపల్లి పంచాయతీ కార్యదర్శి సురేష్, రామకిష్టాపూర్(టి) మాజీ సర్పంచ్ గునిగంటి మహేందర్, టేకుమట్ల మాజీ ఉప సర్పంచ్ నిమ్మల స్వామి, వార్డు సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ



స్కూల్ బ్యాగులు అందిస్తున్న జెడ్పీటీసీ రమణ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ముకునూరు పాలెం గ్రామంలో హోప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 51 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పలకులు, పెన్నులు, తదితర వస్తువులను గురువారం అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ పాయం రమణ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు స్కూల్ బ్యాగ్‌లను అందించడం అభినందనీయం అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకోని మరికొంత ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సంస్థ సభ్యులు మణికుమార్, పపున్నెం, విజయ్ కుమార్, శాంత, నాగమ్మ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని మండపాక గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనాల్లో ఎలాంటి వస్తువులను తరలిస్తున్నారు అనే కోణంలో క్షుణ్ణంగా సోదాలు చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మండల పరిధిలోని వీరభద్రవరం, లక్ష్మీపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు మలేరియా పరీక్షలను నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రెవెన్యూ డివిజన్‌ను అడ్డుకుంటే దీక్ష చేస్తాం

ఏటూరునాగారం: ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కాకుండా అడ్డుకుంటే మంత్రి ఇంటి ముందు దీక్ష చేస్తామని భారతీయ జనతా పార్టీ కిషన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ జాడి రామరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ డివిజన్‌తో పాటు ఏటూరునాగారంలో బస్ డిపో కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండపల్లి సత్యం, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు జనార్ధన్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం సత్యం, మండల ప్రధాన కార్యదర్శి ప్రణయ్, కర్ణ సంపత్, రాకేశ్, రమేశ్, వల్స రంజిత్, లోటపిటల అజిత్, గండేపల్లి రజిని పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు వెన్నపురెడ్డి విజయ్ రెడ్డి (ఫ్లోరిడా అమెరికా) ఎన్ఆర్ఐ టీవీని బహుమతిగా ఇచ్చారు. ఇదే గ్రామానికి చెందిన మడ్క మధు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఏకరూప దుస్తులను బహూకరించారు. రత్న తిరుపతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు బూట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయ్‌రెడ్డి తల్లిదండ్రులు వెన్నపు రెడ్డి సరోజన–రమేశ్‌రెడ్డిలను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. పీజీ హెచ్‌ఎం ప్రకాశ్‌బాబు, రాజిరెడ్డి, సరిత, కల్యాణి, సరావత్ సుల్తానా, మల్లేశం, శరత్ మహారాజ్, రాజ్ కుమార్, సునీత, మహేష్, నరేష్, పసుల శంకర్ నేత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

వాజేడు: ప్రభుత్వం, అధికారుల ఆదేశాల ప్రకారం మీ సేవ బిల్లులను ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాలని మీ సేవ నిర్వాహకుడు గంటా సర్వేశ్వరరావు గురువారం కోరారు. మీ సేవ నుంచి పొందే ఏ సేవకైన ఫోన్‌పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్, టీ వాలెట్ ద్వారానే చెల్లింపులు చేయాలని సూచించారు.

జ్వరం వస్తే వైద్యశాలకు రావాలి



దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



పరీక్షలు చేస్తున్న వైద్యులు

వాజేడు: జ్వరం వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని వాజేడు వైద్యాధికారి మధుకర్ అన్నారు. మండల పరిధిలోని పెనుగోలు కాలనీలో గురువారం మలేరియా జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులను పరీక్షించి మందులను అందించారు. సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రతీ ఇంటిలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఆయన వెంట కోటిరెడ్డి, శేఖర్, చిన్న వెంకటేశ్వర్లు, రజనీ కాంత్, రాజేశ్వరి, సమ్మక్క, నాగలక్ష్మి ఉన్నారు.

విపత్తులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మంగపేట: విపత్తులు వచ్చినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంటలో ఎన్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించినపుడు, పిడుగులు పడినపుడు, గ్యాసిలిండ్ పేలిన సమయంలో వరదలు వచ్చిన సమయంలో, పాము, తేలు కరిచిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. అలాగే చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిరాన్ని నిర్వహించి 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టీవీఆర్ సూరి, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఇంచార్జి ఎంపీఓ కిశోర్, పంచాయతీ కార్యదర్శి సుధారాణి, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

కాటారం: విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని శంకరాంపల్లిలో గురువారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలు, కొమురయ్య, రాజేశ్వర్ అనే ముగ్గురు రైతులకు చెందిన మూడు గేదెలు పశుగ్రాసం నిమిత్తం పొలాల్లోకి వెళ్లాయి. గ్రామంలో ఉన్న విద్యుత్ స్తంభంకు తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను తాకి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన ఒక్కో గేదె విలువ రూ.60వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. కాగా, గ్రామంలో విద్యుత్ వైర్లు తెగి కిందపడి ఉన్నాయని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించినప్పటికీ పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గేదెలు మృతి చెందాయని వారు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

చెట్టు కిందే పాఠాలు!



చెట్టు కింద తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు



శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం

- శిథిలావస్థలో పాఠశాల భవనం
- ఐదు తరగతులకు ఒక్కటే గది
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బోధాపురం గిరిజన ప్రాథమిక పాఠశాలలోని భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు మొత్తం 54 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఐదు తరగతులకు ఒక్కటే భవనం కావటంతో తరగతి గదులు సరిపోక పోవటంతో వరండాలో, చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా వారిలో ఒక్కరిని డిప్యూటేషన్‌పై వేరే పాఠశాలకు పపించడంతో ప్రస్తుతం ఒక్కరే ఐదు క్లాసులకు పాఠాలను బోధించాల్సిన పరిస్థితి. వర్షాలు కురుస్తుండటంతో తరగతులను ఒకే భవనంలో నిర్వహించడం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల భవనం మరమ్మతులు చేయిండంతో పాటు అదనపు తరగతి గదులను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జాలర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై తాజొద్దీన్



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ఏటూరునాగారం: లోతట్టు ప్రాంత ప్రజలు వరదలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జంపన్నవాగు, గోదావరి వరద తీర ప్రాంతాలను ఆయన సందర్శించారు. లోతట్టు ప్రజలకు, జాలర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదలు వచ్చినటప్పుడు ఎవరూ కూడా చెపల వేటకు వెళ్లకూడదని అన్నారు. వాగులను దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. తడిసిన కరెంట్ పోల్స్, తడిసిన గోడలు ముట్టుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సిఆర్పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట బస్టాండ్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డుకు ఇరువైపులా పలు వ్యాపార సముదాయాల ముందు ద్విచక్ర వాహనాలు ఆటోలు ఇతర వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని అన్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నాయని వాహనదారులు వాహనాలు రోడ్ల పక్కన నిలుపొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

మొగుళ్లపల్లి: మండలంలోని కొరికిశాల గ్రామానికి చెందిన ఓరుగంటి బ్రహ్మం ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశాడు. ఆయన వెంట జెడ్పీటీసీ జోరుక సదయ్య, మాజీ ఉప సర్పంచ్ ఐలయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ భీమయ్య, యూత్ నాయకులు అనిల్, మోహన్‌రావు ఉన్నారు.